# ఆఖరి వీడ్కోలు

పోల్కంపల్లి శాంతాదేవి



(గత సంచిక తరువాయి)

"అంతే!" దెబ్బతిన్నట్టుగా అడిగింది స్వప్న.

"ఏకాంతంలో స్వరూప్ నిన్ను చూపులతోనే వదిలిపెట్టాడా?"

ఒక్క విదిలింపుతో అతని కౌగిటి నుండి విడివడింది.

"కోప్పడకు! మనసైన పిల్ల ఏకాంతంలో దొరికితే ఏ మగాడు ఊరుకుంటాడు! ఊరుకున్నాడే అనుకో, అతడిని పరీక్షకోసం డాక్టరు దగ్గరికి పంపాలి!"

ఆ క్షణంలో అతడిమీద తనకి కలిగిన అసహ్యమంతా కళ్ళలో గుమ్మరించింది స్వప్న. "నీచపు బుద్ధికి అంతా నీచంగానే కనిపిస్తుంది!" ఛీత్కారం చేసింది.

"నేను ఎప్పటికప్పుడు మంచిగానే ఉండాలనుకొంటాను! కాని, మగజాతికి ఇదేం బుద్ధిపెట్టాడో భగవంతుడు - నిన్ను చేరాలనుకొన్నప్పుడల్లా నువ్వు ఒంటరిగా కనిపించవు నాకు! నీతో స్వరూప్ గుర్తువస్తాడు! వాడి ఉనికితో ఈ శరీరంలో వేడంతా చల్లబడి

పోతుంది। ఏంచేయను? దీనికి పరిష్కారం ఎప్పటికో నాకు తెలియడం లేదు।"

"మిమ్మల్ని పుడకల్లో కాల్చిననాడు।"

"నిజమేనేమో।.... నేను సుమిత్ర దగ్గరికి వెడుతున్నాను. తలుపు వేసుకో।"

మాధవ్ బట్టలు వేసుకొని వెళ్ళిపోయాడు.

సుమిత్ర।

ఈ సుమిత్ర ఎవరో కొద్దిరోజుల క్రితం మాధవ్‌వల్లే తెలిసింది. సుమిత్ర మాధవ్‌కి చదువుకొంటున్న రోజుల నుండీ పరిచయం. పెళ్ళయింది. పిల్లలు కూడా. మగడి కంట్లో కారంకొట్టి ఇష్టమైన మగవాళ్ళతో తిరుగుతూఉంటుంది. తిరుగుతుంది. తిప్పుకుంటుంది. అలా తిరిగే మగాళ్ళలో మాధవ్ కూడా ఒకడు।

అలా అడ్డమైనవాళ్ళతో తిరిగే ఆడదానితో సంబంధం పెట్టుకోవడానికి లేని అభ్యంతరం, కేవలం మనసు పారేసుకొన్న భార్యతో పెట్టుకోలేడా?

ఏమిటి ఈ మగవాడు? ఏమిటి ఇతడి మనస్తత్వం?

మగవాడికి ఒక ధర్మసూత్రం, ఆడదానికి ఒక ధర్మ సూత్రమూనా?

ఎవరు వ్రాశారు ఈ సూత్రాలు?

ఉదయం తిరిగివచ్చిన మాధవ్-

"స్వప్నా। మనం ఈ ఊరినుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని దూరంగా, ఈ జ్ఞాపకాలకు దూరంగా వెళ్ళిపోదాం। కొత్త జీవితం ప్రారంభిద్దాం।" అన్నాడు.

"అలాగే. మీరెంతదూరం తీసికెళ్ళినా వస్తాను. కాని, స్వరూప్ పేరెత్తారో మిమ్మల్ని చంపి నన్ను చంపుకుంటాను।"

"ఆడదంటే అదీ। ఆల్ రైట్।"

మళ్ళీ సహృదయత తెచ్చిపెట్టుకోడం మొదలైంది.

## 13

నీలాకాశంలో ఒంటరి తెలిమబ్బు నెమ్మదిగా కదిలిపోతూంది। డేగలు కొన్ని రెక్కలు విప్పుకొని గుండ్రంగా తిరుగుతున్నాయి ఆకాశపు కప్పుకింద।

రాత్రి, పగలు పెరట్లో నైట్‌క్వీన్ చెట్టుపక్క ఈజీచెయిర్‌లో కూర్చొని ఆకాశంలోకి చూస్తూ గడపడం అలవాటైంది స్వరూప్‌కు. సెలవు పెట్టి సాగర్‌కి వచ్చిన ఈ రెణ్ణెలనుండి. స్నేహితులు లేరు, సరదాలు లేవు. ఇంట్లో మాట్లాడేది కూడా తక్కువే। స్వప్న తనది కాకపోయిన నాటి బాధకంటే, ఆమె కాపురం కలతలపాలు కావడం అతిగా బాధిస్తున్న దతడిని.

స్వరూప్ ముఖంలో గూడు కట్టిన విషాదానికి వెనుక కథతో పాటు, ఇప్పుడు అతడు ఎందుకు సెలవుపెట్టి వచ్చాడో కూడా తెలుసు ఇంట్లో అందరికీ. ఓదార్పులలో తొలగించే బాధ కాదుకాబట్టి, అతడిని కాలానికే వదిలి పెట్టి ఊరుకొన్నాడు.

ఏ పరిస్థితిలోనూ స్వప్న ఉండగా సిటీకి వెళ్ళకూడ దనుకొన్న స్వరూప్‌కు

సిటీకి వెళ్ళక తప్పని పరిస్థితి ఏర్పడింది. సిటీ కాపురస్తులు, చెల్లెలు అరుణను చూస్తోడానికి వస్తున్నారు. జీపు తీసుకెళ్ళి వాళ్ళను తీసుకురావడం మర్యాదగా ఉంటుందని తండ్రి పురమాయించాడు.

మరునాడు.

పెళ్ళివాళ్ళకోసం ఫలహారాలు వగైరా సిద్ధంచేసి ఎదురుచూస్తున్న సమయంలో ఆఫీసు నుండి ఆదరా బాదరాగా వచ్చాడు స్వరూప్ తండ్రి సూర్యనారాయణ.

"అమ్మా, అరుణా! ఇలారా!" ఆయన గొంతు వణుకుతోంది.

"ఏంటి నాన్నా!"

"అన్నయ్యకు ఏక్సిడెంట్ అయిందటమ్మా...." జేబులోంచి టెలిగ్రాం కాగితం తీసి ఇచ్చాడు.

చదువుకొని కెవ్వుమనబోయింది అరుణ.

"అరవకు! మీ అమ్మకు ఈ సంగతి తెలియనీకు? ఆమె అసలే గుండెనొప్పి మనిషి! ఈ వార్త వింటే నిలువునా ప్రాణాలు వదిలేసినా వదిలేయగలదు."

"అమ్మకి తెలియకుండా ఎలా దాచగలం?"

"వాళ్ళకు రావడానికి వీలు కాలేదని పెళ్ళిచూపులకు విన్నే అక్కడికి తీసుకురమ్మన్నారని టెలిగ్రాం వచ్చిందని చెబుదాం. అయిదు నిమిషాల్లో ఛీఫ్ ఇంజనీరు కారు పంపిస్తానన్నారు. బట్టలవీ సర్దుకో, అమ్మా!"

## 14

స్వప్న జ్ఞాపకాల మీద ఒక మరుపు తెర వాలుతున్న సమయంలో స్వరూప్‌కి ఏక్సిడెంట్ అయి చావుబ్రతుకులమధ్య ఊగిసలాడుతూ హాస్పిటల్లో పడివున్న సంగతి తెలిసింది. మాధవ్ చూసివచ్చి చెప్పాడీ సంగతి!

ఉబికివచ్చే కన్నీళ్ళను ఆపుకోలేకపోయింది స్వప్న. "ఒకసారి చూసివద్దామండీ!" అంది ప్రార్థనాపూర్వకంగా.

మాధవ్ సూటిగా ఆమె ముఖంలోకి చూశాడు. "సిగ్గులేకపోతే సరి!" అన్నాడు ఛీత్కారంగా.

"అంత సిగ్గు లెంచాల్సింది ఏం కనిపించింది మీ కిందులో?" దెబ్బ తిన్నట్టుగా అడిగింది.

"లేకపోతే? అతడిని చూడడానికి హాస్పిటల్‌కి వెడతావా? ఎవరని?"

"ఎవరో మీకు బాగా తెలుసు."

"తెలుసు కాబట్టే, నాకు తెలిసింది ప్రపంచానికి కూడా తెలియడం ఇష్టం లేదు కాబట్టే నిన్ను వెళ్ళవద్దంటున్నాను."

"ఒకసారి చూసివచ్చినంత మాత్రాన నా పాతివ్రత్యాని కేమీ భంగంరాదండీ!"

"నువ్వు నన్ను వెటకారం చెయ్యి. నిందించు ఫర్వాలేదు. నువ్వు మాత్రం అక్కడికి వెళ్ళడానికి వీల్లేదు." మాధవ్ స్వరం ఖచ్చితంగా ఉంది.

దిగ్భ్రమగా చూసింది. "శాసిస్తున్నారా?"

"భర్తగా నాకామాత్రం అధికారం లేదా?"

"ఈ స్వప్న అధికారానికి లొంగే మనిషి కాదండీ। గతంలో నా కెంతో ఆత్మీయుడు। అతడు చావుబ్రతుకుల మధ్య ఉంటే చూసిరావాలనిపించదా? చూడకుండా ఉండడం నావల్ల కాదు. చూసివచ్చినంత మాత్రాన నావల్ల జరిగే తప్పేమీలేదు।"

"వెళ్ళు। కాని, మళ్ళీ రానక్కర లేదు। వచ్చినా నీకిక్కడ చోటుండదు."

"నాచోటు నాకెప్పటికీ ఉంటుంది। నా కెవరూ దయదలచి ఇవ్వాల్సింది కాదిది।"

"ఛీ ఛీ। నీ లాంటి ఆడదానితో సంబంధం పెట్టుకోవడం నా తప్పు। వెళ్ళు। వాడితోనే ఊరేగు।"

"అప్పుడు మీ పరువుంటుందా?"

"నిన్ను కట్టుకొన్ననాడే నా పరువు గంగలో కలిసింది. మిగిలిందేమైనా ఉందంటే నీ ప్రియుడిమీది మోహంతో దాన్ని తగిలేస్తున్నావ్।"

"మీ రిన్నాళ్ళు ఎన్ని మాటలన్నా కుటుంబ గౌరవంకోసం ప్రాకులాడాను. ఆత్మగౌరవం మంటకలిశాక కుటుంబ గౌరవం లెఖ్ఖేమిటి? వెడతాను. అలాగే వెడతాను. మీరు నన్ను బెదిరించేది విడాకులిస్తాననే కదా? ఇవ్వండి. తప్ప కుండా ఇవ్వండి. క్షణ క్షణం ఆత్మ గౌరవం చంపుకొంటూ మీతో కాపురం చేసేకంటే విడిపోవడమే నయం।"

"అలా జరిగిన నాడు ఆత్మహత్య చేసుకొంటానన్నావే।"

"చేసుకోను। నా జీవితంలో త్యాగం చేసే రోజులు గడిచిపోయా యను కొంటాను।" మొండికెత్తినదానిలా అనేసి బాగ్ తీసుకొని బయటికి నడిచింది స్వప్న.

పళ్ళు పటపట కొరుకుతున్న మాధవ్ నోటినుండి అసభ్యకరమైన ఏదో తిట్టు కూడా వచ్చింది।

లెఖ్ఖపెట్టకుండా వెళ్ళిపోయింది స్వప్న.

* * *

ఒళ్ళంతా బేండేజీకట్లతో స్పృహ లేకుండా పడిఉన్నాడు స్వరూప్. అతడి చెల్లెలు అరుణ మాత్రం అతడి బెడ్ దగ్గర ఉంది।

ప్రశ్నార్థకంగా చూస్తోన్న ఆమెకు తనను ఎలా పరిచయం చేసుకోవాలో తెలియలేదు స్వప్నకు. "ఎలా ఉంది?" అస్పష్టంగా గొణిగినట్టుగా అడిగింది.

"ఉదయంవరకు ఏంచెప్పలేమన్నారు డాక్టర్లు।"

కన్నీటితో తడిసిన కళ్ళతో స్వరూప్‌ని చూస్తున్న స్వప్నని ఆశ్చర్యంగా చూసింది అరుణ. "మీరు...."

"నా పేరు స్వప్న."

"స్వప్న।?" గుర్తురావడానికి అరక్షణం పట్టింది. గుర్తువస్తూనే కను బొమలు ముడివేసింది. కళ్ళలో తిర స్కారం చోటుచేసుకోగా, "ఏక్సిడెంట్

సంగతి మీ కెలా తెలిసింది ?" అని అడిగింది.

"మావారు చెప్పారు .... మీరు స్వరూప్ చెల్లెలా ?"

తలూపింది అరుణ. "ఏక్సిడెంట్ అయిందని నాన్నకి ఆఫీసుకి టెలిగ్రాం వచ్చింది. అమ్మకి అంతకుముందే గుండె నొప్పి వచ్చి కొంత తగ్గింది. ఏక్సిడెంట్ సంగతి ఆమెతో చెప్పకుండానే నన్ను బయాల్దేరదీశారు నాన్న. అమ్మకి ఈ సంగతి తెలియదింకా."

స్వరూప్ సన్నగా మూల్గుతున్నాడు.

"ఎంతసేపు నిలబడతారు ? ఆ స్టూల్ మీద కూర్చోండి !" తను కూర్చున్న స్టూల్ ఇవ్వబోయింది.

"మీరు కూర్చోండి. నే నిక్కడ కూర్చుంటాను." స్వప్న స్వరూప్ బెడ్ మీదే కూర్చుంది. ఆ సమయంలో అతడు పరపురుషుడన్న ఆలోచన నశించింది. అతడి చెంపలు ఆప్యాయంగా అరచేత్తో రాయసాగింది. కళ్ళనుండి ఆగని కన్నీరు బుగ్గలుమీద ప్రవాహమైంది.

స్వప్న ప్రవర్తనకి విభ్రాంతిగా చూడసాగింది నీరజ. అన్నయ్యను ఇంతగా ప్రేమించే ఈ మనిషి అన్నయ్య జీవితం అగ్నిగుండంగా ఎందుకు మార్చింది ? ప్రేమకంటే కుటుంబ గౌరవం ముఖ్యమనుకొనే ఈమె ఈ రోజు అన్నయ్యపక్కన కూర్చొని అతడిని స్పృశిస్తూ కన్నీరు కార్చడమేమిటి ? కుటుంబ గౌరవం ఇప్పు డెక్కడికి పోయింది ?

"అమ్మా ! అరుణా !" అరుణ తండ్రి వచ్చాడు. అక్కడ బెడ్‌మీద అపరిచిత యువతిని ఆశ్చర్యంగా చూశాడు.

అరుణ "స్వప్న" అంది నెమ్మదిగా. సైగలతో మరికొంత వివరించింది.

స్వప్నని స్వరూప్ పక్కన ఇంకెవరైనా చూస్తే బాగుండదని, అరుణ స్వప్న భుజం తట్టింది.

పిచ్చిదానిలా చూసింది స్వప్న.

"రాత్రి అయింది. మీ కోసం మీ వారు చూస్తుంటారేమో !"

స్వప్న కంగారుగా లేచింది. కొంగుతో కళ్ళని గట్టిగా తుడుచుకొని, "వస్తాను. స్వరూప్‌కి స్పృహవచ్చాక చెప్పండి, స్వప్న వచ్చి వెళ్ళిందని !" అంది. బాగ్ తీసుకొని బయటికి వచ్చిన స్వప్నతో పాటు అరుణ కూడా వచ్చింది.

"ఇంత ప్రేమించిన మీరు అన్నయ్య జీవితాన్ని నరకంగా ఎలా మార్చారు ?"

"ఇప్పు డనుకొంటున్నాను చాలా పిచ్చిపని చేశానని ! అర్థంలేని త్యాగం చేశానని ! అనుభవించేదానికి రెట్టింపు బాధను అనుభవిస్తున్నాను !"

"మీరు మరొకరిని పెళ్ళాడారని అన్నయ్య వల్ల విన్నప్పుడు ఇలా మోసగించగల స్త్రీలు కూడా ఉంటారా అని

పించింది. నిజంగా అన్నయ్య ఎంత దల్‌గా అయిపోయాడు! నేననుకొంటాను ఈ ఏక్సిడెంట్‌లో అన్నయ్య ప్రాణం పోతేనే బాగుండేదేమోనని! ఒక్కసారి ఏడ్చి ఊరుకొనే వాళ్ళం! నిత్యం బ్రతుకుతూ చచ్చే అతడిని చూడడం ఎంత కష్టం!"

"మరీ ఇంత నిర్దయగా మాట్లాడకండి," ఏడవసాగింది స్వప్న మళ్ళీ, వరండాలో స్తంభానికి ముఖంపెట్టి.

"పెద్దవాళ్ళని గౌరవించడం ముఖ్యమే. అలా ముఖ్యమనుకొన్నప్పుడు వాళ్ళకు అనంగీకారమైన మార్గంలో మరొక వ్యక్తిని మీ ప్రేమపాశంతో బంధించి నడిపించడం తప్పు కాదా? అతడిని అక్కడే వదిలేసి మీ వాళ్ళని బాధించలేనని వెనక్కి పారిపోవడం బాగుందా? ఇప్పుడేడిస్తే లాభమేమిటండీ? నలిగిన మావాడి గుండె సరికాదుగా?" ఆవేశంగా అడిగింది అరుణ.

చివరిసారిగా దేవీబాగ్‌లో స్వరూప్ తనను విడిచి వెళ్ళిననాటి సంఘటన కొద్ది క్షణాల ముందుగా జరిగినంత ఇదిగా కళ్ళముందు కదిలింది స్వప్నకు.

"స్వప్నా! నా కోసం నీ వాళ్ళని త్యాగం చేయలేవా?" ఎంత ఆర్ద్రంగా, దయనీయంగా అడిగాడు స్వరూప్!

తను ఆ క్షణంలో గుండె రాయిగా చేసుకొంది. కొద్దిగా నిగ్రహించుకో గలిగితే తన వల్ల కుటుంబ ద్రోహం, సమాజ విద్రోహం వారింపబడుతుంది కదా అనుకొంది.

కాని, ఈ ధర్మం పేరుతో–మూడు జీవితాలు అశాంతికి నిలయమై పోయాయి!

భార్య తొలివలపు తనది కాదని తన భర్త, వలపు ఒకరిదీ, జీవితం మరొకరిదీ అయిన బాధ తనకూ, వలచిన పిల్ల దూరమై స్వరూప్.... తనానాడు గుండె రాయిచేసుకోవడం వల్ల జరిగిన అనర్థమిది!

స్వప్న ఇంటికి చేరేసరికి రాత్రి పది గంటలయింది. వస్తూ అనుకొంది, మాధవ్ ఎన్ని మాటలన్నా తను మెదలకుండా ఊరుకోవాలని! కాని, మూసిన తలుపుకు తాళం వేలాడుతూ స్వప్నని వెక్కిరిస్తున్నట్లుగా కనిపించింది!

మాధవ్‌ని ఎదిరించి ఈ రోజు స్వరూప్‌ని చూడడానికి వెళ్ళిన ఫలితం మాత్రం బాగుండదని ఊహిస్తూ వచ్చిన స్వప్న మ్రాన్పడినట్టుగా కాసేపు అక్కడే నిలబడింది.

అతడు తనకు గుణపాఠం చెప్పడానికే ఇంటికి తాళం పెట్టుకొనిపోయాడు. ఇప్పుడే వస్తాడన్న ఆశ లేదు. ఇలా రోడ్డుమీద ఎంతసేపని నిల్చోవడం? ఆ వీధి మలుపుదగ్గర స్వప్నకి కావలసిన వాళ్ళ ఇల్లు ఉండడం, ఈ రాత్రి ఈ ఆపదనుండి తప్పించుకోడానికి సరైన ఆశ్రయం అనుకొని అటు నడిచింది.

పిన్ని వరుసైన ఆ ఇంటావిడ, "ఏమే, ఇంత రాత్రి వచ్చావు ?" అంది.

"ఒక ఫ్రెండుకు ఏక్సిడెంట్ అయితే చూడడానికి హాస్పిటల్‌కు వెళ్ళాను, పిన్నీ! వచ్చేసరికి రాత్రి అయింది. ఆయన నా కోసం బయల్దేరారో ఏమో! ఇంటికి తాళం ఉంది. రాత్రిపూట ఎంతసేపని రోడ్డుమీద నిల్చోడమని ఇటు వచ్చాను." అంది.

ఒక గంట అక్కడే కూర్చొని వాళ్ళ అబ్బాయిని పంపించింది మాధవ్ వచ్చాడేమో చూసిరమ్మని. వెళ్ళొచ్చి తలుపు మూసేఉందని చెప్పాడు.

"అయ్యో! మీ ఆయన నీ కోసం ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో !" ఆవిడ ఆత్రం వ్యక్తంచేసింది. "ఏం చేస్తావు? ఈ రాత్రి ఇక్కడే పడుకో!" అంది.

స్వప్నకి గుండెలమీద బరువు తీసేసినట్టుగా అయింది. ఆవిడకు అసలు సంగతి తెలిసిపోకుండా ఈరాత్రి తలదాచుకోడానికి చోటు దొరికింది కదాని!

కాని, ఉదయం కూడా మాధవ్ రాకపోయేసరికి స్వప్నకి పెద్ద చిక్కు సమస్యలో చిక్కుపడినట్టుగా అయింది. 'ఈయన ఇలా నన్ను రోడ్డుమీద నిలబెట్టి అల్లరిపెడదామనుకొన్నారా ?'

పిన్నిగారింట్లోనే ఆ పూట గడిచిపోయింది స్వప్నకు.

సాయంత్రం పిల్లవాడిని పంపితే మాధవ్ వచ్చాడని తెలిసింది.

స్వప్న బయల్దేరింది. ఆమె గుండెలు అదురుతున్నాయి. స్వరూప్‌ని చూడకుండా ఉండలేనని ధిక్కరించి వెళ్ళింది. దానికి ఆయన ప్రతీకారం ఏ రూపంలో ఉంటుందో ? ఆత్మగౌరవం దక్కని సంసారం తన కక్కరలేదని ఆవేశంతో అనేసి వెళ్ళింది కాని నిజంగా అదే జరిగితే? భర్త వదిలేసిన స్త్రీగా నిలబడాలా తను ?

దీని కోసమేనా తను స్వరూప్‌కు పరాయిదైంది ?

ముందు గదిలో ఈజీచెయిర్‌లో సిగరెట్ కాలుస్తున్నాడు మాధవ్. జోళ్ళు గోడవారన విడిచి అతడికేసి చూసీ చూడనట్లుగా లోపలికి వెళ్ళిపోయింది స్వప్న.

స్వప్నని మెడపట్టి గెంటాలని లోనుండి లేస్తున్న ఉగ్రనరసింహుడిని పగ్గాలు పట్టి ఆపుతున్నాడు మాధవ్. స్వప్న ధిక్కారానికి తగిన ప్రాయశ్చిత్తం చేయమని అతడిలోని పురుషాహంకారం రెచ్చగొడుతూంది! కాని, చదువుతో సమకూడిన సంస్కారం అది చాలా మొరటుపని అని గర్హిస్తూంది! పైగా వీధిలో జనమంతా పోగు పడతారని భయం: స్వప్నతోపాటు తనూ ప్రదర్శన వస్తువై పోతాడు!

సరిపడని సంసారాలంటే ఈ ప్రజలకి



ఇప్పుడు రాహుకాలం! మంత్రిగారు మీకు స్వాగతం పలకరు మిస్టర్ జాన్!!

కడుపునిండే టాపిక్. అలాంటి భార్యాభర్త లెంత చులకనై పోతారు వీళ్ళముందు.

కాని.... మర్యాద పేరుతో భార్య అవినీతిని ఎంతకాలం భరించాలి? ఎలా భరించాలి! ఇది సహృదయత అనిపించు కొంటుందా? చవటతన మనిపించు కొంటుందా? మాటలతో తను సాధించే ప్రయోజనం తక్కువనే రాత్రి ఇంటికి తాళం పెట్టుకు పోయాడు. తన కోపం ఆమెకు తెలియాలనే. రాత్రంతా ఎక్కడ ఉండిపోయిందో? ఆ స్వరూప్‌గాడి దగ్గరే ఉండిపోయిందేమో?

ఈ ఊహతో అతడి ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ ప్రాకినట్టుగా అయింది.

దిగ్గున లేచి లోపలికి వచ్చాడు. స్వప్న వంటిల్లు సర్దుతూంది.

"ఎన్ని అటలాడి వచ్చినా భరిస్తానని నీ ఉద్దేశ్యంలా ఉంది! ఈ ఇల్లు నీదికాదని నిన్నే చెప్పేశాను. నువ్వే మర్యాదగా వెళ్ళిపోతే సరి. లేకపోతే మెడపట్టి గెంటాల్సి వస్తుంది!"

"ఒళ్ళంతా గాయాలతో ఒళ్ళు తెలియ కుండా పడిఉన్నాడు అతడు! అతడు జత కలువకుండా నేనొక్కదాన్ని ఏం అటలాడతానని మీ ఉద్దేశ్యం?" అతడేం మాట్లాడినా మెదలకుండా ఊరు కోవాలనుకున్న స్వప్న ఆవేశాన్ని అదుపులో పెట్టుకోలేకపోయింది.

"మళ్ళీ నోరెత్తుతున్నావు! సిగ్గులేక పోతే సరి!"

"దేనికి సిగ్గుపడాలి?"

"ఎంత ధైర్యస్తురాలివి కాకపోతే

పెళ్ళికి ముందు ప్రేమకలాపాలు సాగిస్తావు?"

"ప్రేమకలాపం.....ప్రేమకలాపం.... ప్రేమకలాపం! ఎన్నిసార్లు ఈ మాటతో నన్ను అణచాలని, గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తారు? ప్రేమించి ప్రేమింపబడిన ఆడది అంత లోకువా? నేనేం అతడితో అక్రమసంబంధం పెట్టుకోలేదే! ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని విని మనసుపట్టలేక చూద్దామని వెళ్ళాను. అంతమాత్రానికి నన్ను మెడపట్టుకు బయటికి గెంటుతారా? ఇంటికి తాళం పెట్టుకు వెడతారా?"

"ఇవాళ ప్రేమిస్తే తప్పా అంటున్నావు. రేపు కామిస్తే తప్పా అంటావు! అవును! మనుసులు ఎంత ఎదిగినా ఇవి ఒప్పులనేంతగా ఎదగలేదని నువ్వు గ్రహిస్తే మంచిది. క్షణక్షణం ఆత్మగౌరవం చంపుకుంటూ ఈ సంసారం చేసేకంటే విడిపోవటమే మంచిదన్నావే-క్షణ క్షణం నీ మనుసులో పరపురుషుడు మెదులుతూంటే-నీతో కాపురం చేయడం అంతకంటే నరకం! కలియని మనసులతో ఈ సంసారం చేసేకంటే మనం విడిపోవడమే మంచిది. ఈ సంసారం మరీ హాస్యాస్పదం కాకముందే మనం విడిపోవాలి!"

"మనసులు కలియకపోతే విడిపోవడం, మనసులు కలిసినంత మాత్రాన జీవితాన్ని పెనవేసుకోవడం అంత సులభం కాదండీ, మన సమాజంలో!"

కాదనలేని సత్యమిది!

స్వప్ననుండి తను విడిపోవాలనుకుంటున్నాడు గాని అదంత సులభం కాదు! చట్టబద్ధంగా విడాకులు తీసుకోవాలంటే ఎంత డొంకతిరుగుడో ఉంటుంది. కోర్టులో ఇవ్వాల్సిన సాక్ష్యాలు తలుచుకొంటే కంపరమెత్తుతుంది! చట్టంజోలికి పోకుండా విడిపోవాలంటే ఇరువైపు పెద్దలు రంగంలోకి దిగుతారు.

అలా అని ఇలా ఎన్నాళ్ళు ఈమెతో కాపురం?

ఈ సమస్య ఇద్దరి మధ్యే నలగడం కంటే మూడో వ్యక్తిని ఆహ్వానిస్తే బాగుంటుందేమో! ఈ ఆలోచన వస్తూనే ఒకసారి రమ్మని పురుషోత్తానికి ఉత్తరం వ్రాశాడు మాధవ్.

అతడు మూడోనాటికల్లా దిగాడు.

స్వప్న లోపల వంటచేస్తోంది.

గంటసేపు బావగారి సొద విని అతడు లోపలికి వచ్చాడు. "బావ చెప్పేదంతా నిజమేనా?" అని అడిగాడు.

"ఏం చెప్పాడు?"

"నువ్వు స్వరూప్‌తో మళ్ళీ అక్రమ సంబంధం పెంచుకొంటున్నట్టు చెబుతున్నాడు?"

"ఏక్సిడెంట్ అయి చావుబతుకుల మధ్య ఉంటే చూసి వచ్చాను. ముందు ఆయన్నే తీసుకెళ్ళమన్నాను. సిగ్గు లేకపోతే సరి అని తిట్టాడు. ఒక్కసారి చూసివస్తే తప్పేమిటని ఆయన వద్దన్నా

వెళ్ళాను. దీన్నేనా సంబంధం పెట్టు కోవడమనేది?"

"నీమనసుకి ఇది మామూలు విషయం గానే కనిపించవచ్చు। కాని, మరో మనిషి ఏ మాత్రం సమర్థించలేని విషయం, స్వప్నా। ఒకరికి ఇల్లాలివై అతడిమీద మనసు చంపుకోలేకపోతే.... బావ సహృదయత విన్ను ఈ మాత్రం ఈ ఇంట విలువనిచ్చిందిగాని, మరొకరు మరొకరైతే ఎంతమాత్రం సహించని సంగతి ఇది। దైవికంగానే కాదు, మానసికంగా కూడా మరొకరితో ఆడదాన్ని పంచుకోవడానికి ఇష్టపడడు పురుషుడు।"

పురుషుడు పురుషున్ని సమర్థించక ఏం చేస్తాడు?

కోరిన అమ్మాయి భార్య అయి వచ్చింది. తన బాధ ఇతడికెలా తెలుస్తుంది?

ఈ నీతులు చెప్పేవాళ్ళందరూ ఆ బాధలకు అతీతస్థానంలోఉండే చెబుతారు. స్వప్నలో కసిలాంటిది ఏర్పడుతూంది।

స్వరూప్‌కు దూరమైన బాధ విశ్వ రూపం దాలుస్తున్నట్టుంది. దానికి వీళ్ళ సంకుచితత్వంతో సహకరిస్తున్నారు।

"స్వప్నా, ఈ సంగతి అమ్మవాళ్ళ వరకూ వెడితే ఎంత బాధపడతారో తెలుసా?"

ఈ కుటుంబ మర్యాద పేరుతో రెండు ప్రేమించుకున్న హృదయాలు నిర్దయగా నలిపివేయబడ్డ సంగతి ఈ పెద్దమనిషి గుర్తుపెట్టుకొంటే బాగుండేది।

మాధవ్‌కు అనుకూలంగా నడుచు కొని కాపురం కూలిపోకుండా కాపాడు కొమ్మని, ఈ సంగతి పెద్దవాళ్ళవరకూ సాగకముందే మాసిపోయేలా చేయమని హితవులు చెప్పి, ఉపదేశాలు చేసి వెళ్ళి పోయాడు పురుషోత్తం.

తను ఒకనాడు మాధవ్‌కి మాట యిచ్చింది స్వరూప్‌ని మరిచిపోతానని। మరిచిపోలేకపోతే ఆత్మహత్య చేసుకుం టానని। మొదటిది అసంభవంగా కనిపిస్తోంది. స్వరూప్ తనకి తిరిగి తారసపడకపోతే అది సాధ్యమయ్యే దేమో। రెండోది అది తనకి దగ్గరికి వస్తోన్నట్టే ఉంది।

స్వప్నని ఒక విధమైన నైరాశ్యం, విరక్తి ఆవరించికొన్నాయి.

చాలాసేపటినుండి నిద్రపోతున్నట్టుగా ఉన్న స్వరూప్ కళ్ళు తెరిచాడు. "కుడికాలు కొంచెం పైకి మడువు, అరూ!" తన పక్కన స్టూల్‌మీద కూర్చున్న దెవరో చూడకుండానే అన్నాడు.

స్వప్న అతడు చెప్పినట్టు చేసింది.

కాలు కదుపుతూంటే "అమ్మా, అబ్బా!" అంటూ అతడు వ్యక్తంచేసిన బాధకు స్వప్నకు కళ్ళలో నీళ్ళుతిరిగాయి. చీమకైనా హాని తలపెట్టని మెత్తని మనసు. ఇతడి కింత బాధకు గురిచేశా డెందుకు దేవుడు?

కాళ్ళకింద పడిన దుప్పటి పైకిలాగి అంచులు సరిచేసింది స్వప్న.

అప్పుడు చూశాడు స్వప్న ను, స్వరూప్.

ఆనందం, ఆశ్చర్యం ముప్పిరిగొన్న కంఠంతో, "స్వప్నా! నువ్విక్కడ...." అంటూ అర్థోక్తిలో ఆపాడు.

అతడి ముఖంలో భావాలు చూసి నవ్వబోయింది. "మీరు చూస్తున్నది స్వప్ననే. కల కాదు."

"అరుణ ఏదీ?"

జవాబు చెప్పాల్సి వచ్చేసరికి స్వప్నకు గుండెలో రాయిపడినట్టుగా అయింది. కొడుక్కి ఏక్సిడెంట్ అయిన సంగతి ఎలాగో స్వరూప్ తల్లి కి తెలిసి గుండెలో నొప్పి వచ్చి మాటాపలుకు లేకుండా పడిపోయిందట. అక్కడినుండి ఎవరో ట్రంకాల్ చేస్తూనే అరుణా, ఆమె తండ్రీ ప్రయాణం కాక తప్పలేదు.

అరుణ స్వప్న అడ్రస్ అతికష్టం మీద తెలుసుకొని వచ్చి, తిరిగి తాము వచ్చేదాకా అన్నయ్య సేవాభారం స్వీకరించమని అర్థించింది.

స్వప్న సందేహించకుండా అరుణతో వచ్చి స్వరూప్ భారాన్ని మీద వేసు కొంది. ఆ సంగతే స్వ రూ ప్ తో చెప్పింది.

తల్లి ని గురించిన ఆందోళనతో నిండి పోయింది స్వరూప్ ముఖం. అమ్మకి గుండెలో నొప్పి వచ్చినప్పుడల్లా ప్రాణం పోయినంత పనిగా చేస్తూ ఉంటుంది! ఇప్పుడు ఎలా ఉందో?

"మాధవ్ ని అడిగివచ్చావా?" కాసేపు అయ్యాక అడిగాడు.

"ఆఁ.వెళ్ళమన్నాడు." ఆ సమయంలో నిజం చెప్పి అతడిని నొప్పించాలనిపించ లేదు.

"అయితే మాధవ్ మారాడన్నమాట" అతడి కళ్ళలో సంతృప్తిలాంటిది కదిలింది. "ఎక్సిడెంట్ ఎలా అయిందో తెలుసా?"

"తెలుసు. ఆర్. టి. సి. బస్సుకింద పడ్డావు."

"ఎందుకు పడ్డానో తెలుసా?"

"కావాలని పడ్డావా?" స్వప్న భయంగా అడిగింది.

"కావాలని కాదు. నాకు ఏక్సిడెంట్ జరిగిన రోజు నువ్వు సుల్తాన్‌బజార్ వచ్చావా?"

"రాలేదే?"

"అయితే నీలాంటి అమ్మాయి ఉండాలి! నువ్వే అనుకొన్నాను. నీ కళ్ళలో పడకూడదని గబగబా వెళ్ళ బోయాను! ఆ తొందరలో పడ్డాను బస్సుకింద."

స్వరూప్ కోరికమీద అతడిని దిళ్ళకు చేరగిల కూర్చోబెడుతూండగా గదిలోకి ఇద్దరు యువకులు వచ్చారు. ఆ ఇద్దరిలో ఒకడు మాధవ్. రెండో అతను రాంప్రసాద్. స్వరూప్‌ని పరామర్శించి అయిదు నిమషాల్లో వెళ్ళిపోయారు.

"స్వప్నా, మాధవ్ మాట్లాడలే దేమిటి నీతో ?"

"పక్కన ఆయన స్నేహితుడు వున్నాడుగా? నేను తన భార్యనని అతడికి తెలియడం ఇష్టంలేదు కాబోలు!"

"నిజం చెప్పు, స్వప్నా! నువ్వు రావడం మాధవ్‌కి ఇష్టమేనా ?"

"అరుణ వచ్చి పిలిచినప్పుడు ఆయన ఇంట్లోనే ఉన్నాడు. ఆపదలో ఆదుకో లేకపోతే మనం ఎందుకు - వెళ్ళు," అన్నాడు.

నిజానికి అరుణ వచ్చి పిలిచినప్పుడు మాధవ్‌ని ఒక్క మాటకూడా అడగలేదు స్వప్న. తను త్వరలో జీవితం చాలించ బోతూంది, మాధవ్‌కి తను చేసిన వాగ్దానం ప్రకారం! అతడిని అడగాల్సిన అవసరం కనిపించలేదు!

అరుణ, ఆమె తండ్రి రెండు రోజులవరకూ రాలేదు.

ఈ రెండు రోజులు మనస్ఫూర్తిగా స్వరూప్‌కి సేవచేసింది స్వప్న. తన కారణంగా ఇతడెంతో మానసిక వ్యథ అనుభవించాడు! ఆత్మహత్య చేసుకో బోతూ ఈ మాత్రం ఇతడికి సేవ చేసుకోగల అవకాశం లభించడం తన అదృష్టం !

స్వప్న ఇంటికి వచ్చినా, బయటికి వెళ్ళినా 'ఎక్కడికి ? ఎందుకు ?' అని అడగడం మానేశాడు మాధవ్. అతడూ ఒక నిశ్చయంగా రాగద్వేషాలను జయించే ప్రయత్నంలో ఉన్నాడు. ఎలాగూ విడి పోవడానికి నిశ్చయించుకొన్నాక ఆమె ఎక్కడికి వెడితే ఏం? ఏం చేస్తే ఏం? అవమానమా ?

దాన్ని అరికట్టడం తన తరం కాదు!

రెండు రోజులతరువాత తిరిగివచ్చిన అరుణ, ఆమె తండ్రీ జీవచ్ఛవాల్లా కనిపించారు. వస్తూనే అరుణ బావురు మంటూ అన్నగారి మీద పడింది. "అమ్మని బూడిద చేసివచ్చాం, అన్నయ్యా" అంటూ.

## 18

బడినుండి వచ్చి తలుపు తాళంతీసి లోపలికి అడుగుపెట్టిన స్వప్న ఇంట్లో జరిగిన మార్పుకు కొయ్యబారినట్టుగా నిలబడిపోయింది.

గదిలో సామానంతా చెల్లా చెదురుగా పడిఉంది.

స్వప్న తలుపు తెరుస్తూనే కంటికి కనిపించేలా టీపాయ్‌మీద ఫ్లవర్ వాజ్ కింద కాగితం ఉంచబడింది.

ఆ కాగితం చేతిలోకి తీసుకోకముందే ఏం జరిగిఉంటుందో స్వప్నకు తోచి పోయింది. మాధవ్ వెళ్ళిపోయి ఉంటాడు, ఈ ఇంటిని వదిలేసి. తనని వదిలేసి చాలా రోజులు అయింది.

తన కుర్చీలు, బల్ల ఇంకా తనదైన సామాను ఏముందో అవన్నీ తీసుకెళ్ళి పోయినట్టున్నాడు. ఇల్లంతా ఒకసారి కలియదిరిగి చూసి టీపాయ్ దగ్గరికి

వచ్చింది. ఫ్లవర్‌వాజ్ జరిపి వణికే చేతులతో కాగితం చేతిలోకి తీసుకొంది.

"స్వప్నా!

నేను వెళ్ళిపోతున్నాను.

మనం కలిసి భార్యాభర్తలంగా జీవించడానికి ఏడాది గడువు కోరావు! స్వరూప్‌ని మరిచిపోవడానికి ఈ వ్యవధి కావాలన్నావు. ఇచ్చాను. ఏ మగవాడూ ఇవ్వని అవకాశం నేను నీకిచ్చాను! ఈ అవకాశాన్ని నువ్వే వృధా పుచ్చుకొన్నావు! దోషరహితంగా వెళ్ళిపోతున్నానన్న తృప్తి నాకుంది.

ఇక పోతే,

నువ్వా గడువు కోరిననాడు నాకొక వాగ్దానం చేశావు. నేను జ్ఞాపకం చేస్తున్నందుకు నీకు కొంచెం కష్టంగా ఉండవచ్చు! నీ ప్రేమ కథ ప్రపంచం ముందు బట్టబయలు కాకముందే, నీ భర్త నిన్ను వదిలేశాడని ప్రపంచానికి తెలియకముందే నువ్వు ప్రాణత్యాగం చేస్తానన్నావు!

నువ్వు నీ వాగ్దానాన్ని వెంటనే నిలబెట్టుకో గలిగితే మన రెండు కుటుంబాల పరువు మంటగలువకుండా కాపాడిన దానవౌతావు!

ఆవేశంతో వాగ్దానం చేశానంటావా - నీ ఇష్టం! నీ విశృంఖల జీవితానికి నేను అడ్డురాను. త్వరలో నీకు విడాకు లందేలా చేస్తాను - మాధవ్."

చదువుకొని, చాలాసేపు నిర్జీవ ప్రతిమలా కూర్చుండిపోయింది స్వప్న.

అవును! మాధవ్ దోషరహితంగా వెళ్ళిపోయాడు! స్వరూప్‌ని మరిచిపోలేనని, మరిచిపోలేని పక్షంలో ఆత్మహత్య చేసుకొంటానని చెప్పింది! తన మాట నిలుపుకోవాల్సిన సమయం వచ్చింది!

కాని,

మాధవ్ ఎంత నిర్దయుడై పోయాడు తన పట్ల! ఆత్మహత్య చేసుకొమ్మని ఆదేశించేముందు అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య అన్న అభిమానం, ఇన్నాళ్లు ఒక కప్పుకింద కలిసి జీవించిన అనుబంధం పిసరంతకూడా అడ్డురాలేదా?

దొంగలు పడి చెల్లాచెదురుగా చిమ్మివేసినట్టుగా పడిఉన్న వస్తువులకేసి వెర్రిగా చూస్తూ చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది. అవి సర్దే ప్రయత్నం చేయలేదు. మాధవ్ కోసం భార్యగా తనేమీ చేయకపోయినా అతడి చివరి ఆదేశాన్నైనా వెంటనే నెరవేర్చాలి!

మాధవ్ వ్రాసుకునే లెటర్ పాడ్ తీసుకొని ఒక పేజీలో ఇలా వ్రాసింది.

"మాధవ్‌గారూ!

మీ ఆదేశానికి పూర్వమే నా వాగ్దానం నెరవేర్చుకోవాలనే నిశ్చయానికి వచ్చేశాను. నావల్ల మీకు భార్యగా సుఖం దక్కకపోయినా అప్రదిష్ట చుట్టుకొనేలా చేయడం ధర్మం కాదని తెలుసు! అందుకే వెంటనే మీ ఆదేశం నెరవేరుస్తున్నాను.

— స్వప్న."

మరో కాగితం మీద ఇలా వ్రాసింది.

"ప్రియమైన స్వరూప్!

వెళ్ళిపోతున్నాను. ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోతున్నాను. నువ్విది చదువుకొని 'స్వప్నా' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచే సమయానికి అది వినడానికి స్వప్న జీవించిఉండదు.

దేవీబాగ్‌లో మన ప్రేమలతని పెంచుకొన్నాం.అక్కడే విరిచేశాననుకొన్నాను. తాత్కాలికంగా విరిచేశానేమో గాని తిరిగి నిన్ను చూడడంతో అది అసలు కొనలుగా సాగి మాధవ్‌కి నేనిచ్చిన వాగ్దానం నిలుపుకోలేని బలహీనురాలిని చేసింది!

దానికి పరిహారంగా ఆయనకి నేనిచ్చిన వాగ్దానం మరో విధంగా చెల్లించేలా చేసింది. (ఆ వాగ్దానం ఏమిటో మాధవ్ వ్రాసిన ఉత్తరం దీనితో జతచేస్తున్నాను. చదివితే నీకు తెలుస్తుంది!) మాధవ్‌కి నేను వ్రాసిన ఆఖరి మాటలు అతడి అడ్రస్‌కు పంపించు!

నిన్ను పెట్టిన బాధకు నాకీ శాస్తి కావలసిందేగా. స్వరూప్? నీ హృదయం ఎంత ఘోషపెట్టిందో-అది ఉసురుగా నన్ను భర్తృపరిత్యక్తను చేసింది. మళ్ళీ జన్మంటూ ఉంటే నిన్ను ప్రేమించి పెళ్ళాడే అదృష్టాన్ని కోరుకొంటూ వెళ్ళిపోతున్న-స్వప్న."

మాధవ్ వ్రాసిన చీటీతోపాటు ఈ రెండు కాగితాలూ జత చేసి కవరులో పెట్టి మూసి స్వరూప్ అడ్రస్ వ్రాసింది.

కవరుబాగ్‌లో పెట్టుకొని ఇంటికి తాళం పెట్టి బయల్దేరింది. బజారులో టిక్ ట్వెంటీ తీసుకొని అది కూడా బాగ్‌లో పెట్టుకొంది. అక్కడనుండి స్వరూప్ ఇంటికి బయల్దేరింది ఆటోలో.

స్వరూప్ డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చి రెండురోజులైంది. మరో వారం రోజుల్లో అతడు సాగర్ వెళ్ళిపోతున్నాడు. ప్రస్తుతం అన్నను కనిపెట్టుకొని అరుణ ఇక్కడే ఉంది.

స్వరూప్ స్వప్నని చూస్తూనే అడిగాడు. "మాధవ్ ఈరోజు శ్రీశైలం వెళ్ళిపోయాటడగా? నువ్వెప్పుడు వెళతున్నావు, స్వప్నా?"

"ఎవరు చెప్పారు నీకు?"

"రాంప్రసాద్!"

అయితే ఆయన శ్రీశైలం వేయించుకొని తనకి దూరంగా వెళ్ళిపోయాడన్న మాట!

"ఆయన క్వార్టర్ దొరికాక రాస్తానన్నారు. సెలవుపెట్టి వెడతాను!"

అరుణ టీ తీసుకువచ్చి ఇచ్చింది.

"బోర్ కొడుతూంది, పిక్చర్‌కు వెడదామా, స్వప్నగారూ?"

"సారీ అరుణా! తలనొస్తూంది!"

"అయితే కూర్చొని కబుర్లు చెప్పుకొందాం. కూర్చోండి. నేను గబగబా వంట ముగించేసి వస్తాను. ఈ రాత్రి మీరిక్కడే భోజనం చేయాలి! మీవారు లేరుగా?" అరుణ లోపలికి వెళ్ళిపోయింది.

స్వప్న, స్వరూప్ ఇద్దరే మిగిలారు.

"మూగబొమ్మలా నా ముఖంలోకి అలా చూస్తూన్నావేమిటి, స్వప్నా?" ఆర్తిగా తన కళ్ళలోకి చూస్తున్న స్వప్న కేసి ఆశ్చర్యంగా చూశాడు.

"ఎలా చూస్తున్నాను?"

"ఇంకెప్పుడూ ఈ ముఖాన్ని మరి చూడబోనట్టుగా ఆఖరిసారిగా తృప్తిగా చూచుకొంటున్నట్టుగా ...."

"వెళ్ళిపోతున్నానుగా? ఇంకెందుకు చూ స్తా ను నిన్ను? నిన్ను చూ స్తే మాధవ్‌లో ఈర్ష ....అనుమానం....అత డిలో మళ్ళీ అవి రేగకుండా మనది శాశ్వతమైన వీడ్కోలు కావాలి!" ఈ మాట అం టుం టే స్వప్న కళ్ళలో కన్నీటి తడి మెరిసింది. గొంతు గాద్గదిక మైంది.

"శాశ్వతమైన వీడ్కోలు!" నిర్వే దంగా నిశ్వసించాడు. "అదే దేవీబాగ్‌లోనే జరిగిందనుకొన్నాను. కాని, మళ్ళీ తారసపడి మీకాపురంలో కలతలు రేపుతా ననుకొన్నానా? బ్రతికి ఉన్నంత సేపు ఇదే శాశ్వతమైన వీడ్కోలు అని ఎలా అనుకొంటాం స్వప్నా?"

"ఉహుం. మనం ఇక కలుసుకోం!"

"ఎలా చె ప్ప గ ల వు? ఎప్పుడో, ఎక్కడో కలుసుకోకపోతామా?"

"కలుస్తామో ఏమో! ఈ రూపంలో మాత్రం ఉండము!"

"ఏ రూపంలో ఉంటాం? తల ముగ్గు బుట్టల్లా నెరిసి ఒళ్ళు ఒణుకుతూనా? అప్పుడు పేచీ ఉండదు! అప్పుడు మనల్ని ఎంత సన్నిహితంగా చూచినా మాధవ్ ఈర్ష్యపడడు!"

స్వరూప్ ఊహించినట్టుగా స్వప్న నవ్వలేదు.

"స్వప్నా!" ఆర్తిగా పిలిచాడు. "ఈ రోజు నీ ముఖంలో ఏదో వ్యధలో కని పిస్తోంది! ఎందుకు బాధ? మాధవ్‌కూ నీకూ మళ్ళీ ఏదైనా జరిగిందా!"

"ఏం జరగలేదు."

"అలా ఉన్నావెందుకు?"

"తలనొప్పి!"

"అంతేనా?"

అరుణ వచ్చింది, పొ యి మీ ద కుక్కరుంచేసి.

స్వప్న లేచింది హఠాత్తుగా.

"మీరు లేస్తున్నారేమిటి? మీకోసం నేను వంటచేస్తున్నాను!"

"ఉహుం. నేను ఇంటికి వెళ్ళి పోవాలి! మరెప్పుడైనా వ స్తా ను!" బాగ్ చే తి లో కి తీసుకొంది. అరుణ అభ్యర్థన లెక్కచేయకుండా గబగబా మెట్లు దిగసాగింది. తూలి రెయిలింగ్ ఆసరా చేసు కో బో యిం ది గాని పట్టు చిక్కక దొర్లిపోయింది.

కెవ్వుమంది అరుణ.

స్వప్నకి స్పృహ వచ్చేసరికి అరుణ బెడ్‌మీద ఉంది. అరుణ, స్వరూప్ ఆమె ముఖంలోకి ఆత్రుతగా చూస్తూ కూర్చుని ఉన్నారు.

"ఏ మైంది నాకు?" దిగ్గున లేవ బోయింది.

"పడుకోండి, స్వప్నా!" వారించింది అరుణ.

"ఊహుఁ. నేను వెళ్ళాలి. ఇప్పుడు నాకు బాగానే ఉందిగా?"

"...................."

"నా బాగ్ ఏదీ?"

"నీ బాగ్, అందులోని వస్తువులు నా దగ్గర జాగ్రత్తగా ఉన్నాయి."

స్వరూప్ చెప్పాడు. అతడి ముఖం ఎందుకో సీరియస్‌గా ఉంది.

"ఇలా ఇవ్వు, స్వరూప్! నేను వెళ్ళాలి."

బాగ్ ఇచ్చాడు. చించిన కవరు చూపిస్తూ, "ఇది నాదేకదూ! పోస్టులో పడి రేపు చేరేబదులు ఈరోజే నన్ను చేరింది." అన్నాడు.

స్వప్న కంగారుగా బాగ్ వెదికింది. కవరుతోపాటు టిక్‌ట్వంటీ బాటిల్ కూడా లేదు. స్వప్న కన్నీళ్ళ పర్యంత మైంది. "నా బాటిల్ ఇచ్చేసి నన్ను వదిలిపెడితే నీకు...." ఆ తరువాత గొంతు పెగలనంతగా బిగుసుకు పోయింది.

"....నాకు!"

"ఎప్పటికీ ఋణపడి ఉంటాను!"

"నీ ఋణం నేనేం చేసుకోను? ఈ ప్రపంచంలో దానాలన్నిటా అన్నదానం గొప్పదన్నారు. కాని, ప్రాణదానం మరీ గొప్పదంటాను! నువ్వు చనిపోవడానికి వీల్లేదు, స్వప్నా! నిన్ను చనిపో నివ్వను!"

"నా జీవితానికి పరిష్కారం అదే. నన్నడ్డగించకు, స్వరూప్!"

"నువ్వెప్పుడూ ఆవేశంతో కూడిన నిర్ణయాలే చేస్తుంటావు, స్వప్నా! దేవీబాగ్‌లో ఆఖరిసారిగా ఎంత ప్రార్థించాను నిన్ను! ఆరోజు నా ప్రార్థన వింటే ఈనాడు ఇంత నరకం ఈ మూడు జీవితాల్లో ఉండేదా?

"నేను మీ రెండు జీవితాల్లో సృష్టించిన నరకాన్ని నావెంట తీసికెళ్ళిపోతాను. ఆయన నెల తిరగకుండానే సుబ్బరంగా మరొకతెను పెళ్ళాడతాడు. ఎప్పుడో గుర్తువచ్చినా 'దుర్మార్గురాలు' అని తిట్టుకొంటాడు, అంతే. నువ్వు జీవితానికి కొక తోడు వెదుక్కోగలిగితే కాల ప్రవాహంలో నా స్మృతి కొట్టుకు పోతుంది."

"నువ్వు 'ఆత్మహత్య' తప్ప ఇంకేదైనా మాట్లాడు!"

"ఇది తప్ప మిగిలిందేమీ లేదు!"

"నువ్వు మాధవ్‌ని క్షమార్పణ కోరలేవా?"

"దేనికోసం క్షమార్పణ? నిజానికి నేను చేసిన తప్పేమిటి? నువ్వు హాస్పిటల్లో చావు బతుకుల మధ్య ఉంటే ఒక సారి చూడాలని తపించదా నా మనసు? దానికి—ఆయన నా ఇంట్లో చోటులేదు

పొమ్మంటాడా? ఒకసారి చూచి వచ్చి నంత మాత్రాన మైలపడిపోతానా? ఈ మాత్రానికే కులటనౌతానా? మరీ ఇంత సంకుచితమా ఆయనకు?"

"ఎవరి స్థానంలో ఉండి ఆలోచిస్తే ఎవరిది వాళ్ళకు రైట్‌గానే ఉంటుంది! మనిషి సహజ స్వభావానికి లొంగితే మాధవ్ తప్పేముంది? రేపు నిన్ను మాధవ్‌దగ్గర వదిలిపెట్టి వస్తాను! తయారవ్వు!"

"నువ్వు వదిలిపెట్టి వస్తానంటే అతడు ఉంచుకోవద్దూ?"

"ఆ విషయం నా కొదిలి నువ్వు నిశ్చింతగా ఉండు!"

"నిశ్చింత! పులిబోనులో మనిషి ఎంత నిశ్చింతగా ఉండగలడో నేనంత నిశ్చింతగా ఉండగల నతడిదగ్గర!"

"ఇక నిశ్చింతగానే ఉండగలవు, స్వప్నా! మాధవ్ కి మంత్రం వేసి వస్తాగా? ఇహ జీవితంలో నిన్ను అవమానించడు. బాధించడు!"

"ఏం మంత్రం వేస్తావు?"

"ఇప్పుడు చెప్పకూడదు. తరువాత నీకే తెలుస్తుంది!"

"ఎలాగా నన్ను ఆత్మహత్య చేసుకోనివ్వవు: నువ్వు చెప్పింది వినడం తప్ప గత్యంతరం లేదు! నీ మధ్యవర్తిత్వం ఫలించకపోతే, మనల్నిద్దరినీ మాట్లాడకముందే గెట్ వుట్ అంటే?"

"నిన్ను ఆత్మహత్య మాత్రం చేసుకోనివ్వను. సరా?"

"మగడొదిలేసిన స్త్రీగా మిగలనా? దానికోసమేనా నిన్ను పోగొట్టుకొంది?"

'స్వప్నా! ఆ పరిస్థితే వస్తే నిన్ను తీసుకొని ఈ కుళ్ళు సమాజానికి దూరంగా వెళ్ళిపోతాను! అక్కడ మనం స్వర్గం నిర్మించుకొందాం! ఆనందంగా జీవిద్దాం!' ఈ మాట మనసులోనే అనుకున్నాడు స్వరూప్. ఆ మాట బయటికి అనేసే సమయమిదికాదు.

## 17

ఎంత పీహ్యం, క్రోధం గుమ్మరించవచ్చో అంతా గుమ్మరించాడు మాధవ్, స్వప్ననీ స్వరూప్‌నీ చూసి. పిశాచాల పీడ వదిలించుకొని వచ్చి హాయిగా గాలి పీల్చుకొంటున్నా ననుకొంటున్నప్పుడు, అవి తనని వెన్నాడే వచ్చినాయని తెలిసినప్పుడు ఆ మనిషి ముఖం ఎలా పెడతాడో అలా పెట్టాడు!

"ఎందుకొచ్చారు?" అడగడం కాదు, గర్జించడం అంటారేమో?

అంతకంటే రౌద్రంగా అన్నాడు స్వరూప్! "ముందు నువ్వు గొంతు తగ్గించు, లేకుంటే చంపేస్తాను!"

"ఏమిటి ఈ దబాయింపు?"

"దబాయించడం కాదు. చంపి పాతిపెట్టాలి నీలాంటి మనుషుల్ని!"

"ఏం ప్లాన్‌తో వచ్చారు ?"

"స్వప్నా! ముందు నువ్వు లోపలికి వెళ్ళు! వీడి సంగతి నేను తేల్చుకొంటాను!"

"ఏం కొడతావా?"

"అవసరమైతే తప్పకుండా! నువ్వు ఎంత దుర్మార్గుడివి కాకపోతే స్వప్నని చచ్చిపొమ్మని వ్రాసిపెట్టి వస్తావు! నిజంగా అదే జరిగితే, నువ్వు వ్రాసిన చీటీ పోలీసుల చేతిలో పెడితే నీ గతి ఏమయ్యేదిరా?"

"ఏమైనా ఫర్వాలేదు. ఆ పిశాచం పీడ వదిలితే చాలు!"

"నే నడ్డుపడకపోతే, స్వప్న నీ ఆదేశం శిరసావహించి అనక పిశాచమై నిన్ను పట్టేది!" ఆనాటి సంఘటన చెప్పాడు.

"మాటలు అనవసరం! దాన్ని తీసుకొని ముందు నువ్వు ఇక్కడినుండి వెళ్ళు!"

"నీకిష్టం లేనప్పుడు స్వప్న నన్ను చూడడానికి రావడం తప్పే. నాకు సేవ చేయడం అంతకంటే తప్పే! మా మధ్య అనురాగ సంబంధం తప్ప నువ్వు ఈర్ష్యపడే, అసహ్యించుకునే సంబంధమేమీ లేదురా! ఈ ఒక్కసారికి ఆమెను క్షమించు! మరోసారి ఇలా జరుగదు! మీ కాపురంలో కలతలకు కారణం నేను కాబట్టి దిద్దాల్సిన బాధ్యత నాదే కదా?"

గంటసేపు వాగ్వివాదం తరువాత, ఎన్నో హితవులు చెప్పాక మాధవ్ కాస్త తగ్గి దారిలోకి వచ్చాడు.

* * *

స్వప్ననుండి వీడ్కోలు తీసుకొంటూ అన్నాడు స్వరూప్. "స్వప్నా! ఇది భారతదేశం! ప్రేమించుకొన్న జంటను ఎంతగా విడదీయాలని చూస్తారో, ఒకసారి అగ్నిసాక్షిగా జరిగిన పెళ్ళిపెటాకులు కాకుండా ఆ కాపురం నిలబెట్టాలని అంతగా శ్రమిస్తారు? ఈసమాజంలో ఒకమనిషిగా నీ కాపురం నిలబెట్టిన తృప్తి చాలు. ఇంకెప్పుడూ ఆత్మహత్యలాంటి పిచ్చి పని తలపెట్టకు!

"చాలా చెప్పాలనీ, చాలా మాట్లాడాలనీ ఉంది; కాని, ఏం మాట్లాడలేక పోతున్నాను. ఈ వీడ్కోలు సమయంలో. ఇది నిజంగా శాశ్వతమైన వీడ్కోలు. ఇంకెప్పుడూ నీ కళ్ళబడను! ప్రభాతకాలంలో ఆకుమీద మెరిసే మంచు ముత్యం మధ్యాహ్నం అయ్యేసరికి రూపులేకుండా మాసిపోతుంది. అలాగే మన ప్రేమ కథ! కొద్దిరోజుల తరువాత ఆనవాలు కూడా మిగలదు నీ హృదయంలో. భర్తా, పిల్లలూ, సంసారం నిండా మునిగిపోతావు! అవునా? నా కోరికా అదే....అదేమిటి? అలా చూస్తావు? పిచ్చిపిచ్చిగా వాగుతున్నానా? మళ్ళీ ఇంకెప్పుడు చూడనుగా? వెడుతున్నాను, స్వప్నా! చాలా దూరం, వెనుదిరిగి వచ్చేయలేనంత దూరం వెళ్ళిపోతున్నాను. సెలవు స్వప్నా! ఇదే ఆఖరి వీడ్కోలు!"

రెండు రోజుల తరువాత అరుణనుండి

ఒక టెలిగ్రాం, తరువాత ఒక ఉత్తరం వచ్చాయి.

స్వప్న తను తాగడానికి తెచ్చుకున్న టిక్ట్వంటీ బాటిల్ స్వరూప్ తాగి ఈ లోకం విడిచిపోయాడు!

మాధవ్ నుద్దేశించి స్వరూప్ చివరి మాటలు ఆ ఉత్తరంతో జతచేసింది అరుణ.

"మాధవ్!

నీలో ఈర్ష్యనీ, అనుమానాన్నీ హరించడానికి నే నీలోకాన్ని విడిచి పోతున్నాను. తనకోసం నే నేమైనా చేస్తానని ఒకనాడు స్వప్నకు మాటిచ్చాను. స్వప్న సుఖపడడం కోసం, నామాట నిలబెట్టుకోవడం కోసం నేను ఈ పని చేయక తప్పడంలేదు! ఈ ప్రపంచంలో నేను ఏ మూలన ఉన్నా నువ్వు ఈర్ష పడతావు కదా? అది స్వప్నని బాధించే దిగా తయారవుతుంది! నా మూలంగా స్వప్న బాధింపబడడం నాకు హృదయ శల్యంగా ఉంటుంది!

మాధవ్! స్వప్నని బాధపెట్టవుకదూ? చనిపోయినా నా ఆత్మకు శాంతి లేకుండా చేయవు కదూ?

చేశావూ—

నువ్వు నా దగ్గరికి వచ్చాక నీ అంతు తేల్చుకోడానికి సిద్ధంగా ఉంటాను—స్వరూప్.

మాధవ్ ఇది చదువుకొని స్తంభించి పోయాడు.

"రే, స్వరూప్! ఎంత పిచ్చిపని చేశావురా? నువ్వంటే నాలో రగిలిన ఈర్ష్య నిన్ను బలితీసుకొందా?" అతడి కళ్ళ నుండి అశృవులు రాలసాగాయి.

స్వప్న తల బాదుకొని ఏడవసాగింది.

'మాధవ్! నువ్వు వేస్తానన్న మంత్రం ఇదా? ఏకాస్త ముందు తెలిసినా ఈ పని జరగనిచ్చేదాన్నా! నువ్వు చచ్చిపోవడమే నయమైందేమో! నువ్వు బ్రతికి ఉన్నంతసేపు నాలో నిన్ను చంపడానికి ప్రయత్నించేదాన్ని. చచ్చిపోయి నాలో నీవు చిరంజీవి వయ్యావు!'

(సమాప్తం)